## ముందస్తు ఇంటిపన్నులు చెల్లించేవారికి 5 శాతం రాయితీ

**కీసర:** దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటిపన్నులు ఈ నెల 30వ తేదీలోగా ముందస్తుగా చెల్లించేవారికి 5 శాతం రాయితీ కల్పించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## బూటకపు హామీలతోనే కాంగ్రెస్‌కు అధికారం: ఈటల



కోనాయిపల్లి ప్రచారంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

**మేడ్చల్:** అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి అధికారం పొందిందని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఆయన మేడ్చల్ మండలం గౌడవెళ్లి, కోనాయిపల్లి, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ గుండ్ల పోచంపల్లి, మైసమ్మగూడలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితం తప్ప ఎలాంటి హామీలు నెరవేర్చలేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వం కరోనా కాలం నుంచి పేదలకు ఉచితంగా బియ్యం అందజేస్తోందన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మించి ఏళ్ళ తరబడి సమస్యకు పరిష్కారం చూపిందని అన్నారు.

## బీఆర్‌ఎస్ సమావేశానికి తరలిన శ్రేణులు

**కీసర:** శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తాలో గల సీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతోపాటు కీసర మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నేతలు, నాయకులు తరలివెళ్లారు. దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, బీఆర్‌ఎస్ అధ్యక్షులు తేళ్ళ శ్రీధర్, తిరుపతిరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తరలివెళ్లినవారిలో ఉన్నారు.

## 'మజ్జిగ పంపిణీ' ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న చంద్రారెడ్డి తదితరులు

**కీసర:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో వేసవిని దృష్టిలో పెట్టుకొని బీజేపీ సీనియర్ నేత మల్‌రెడ్డి, మీనాక్షి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం 'సేవ్‌వాటర్ సేవ్ ఎర్త్ పోస్టర్'ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడకుంటే రాబోయే రోజుల్లో సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మల్లారెడ్డి, కమలాకర్, సూర్యశేఖర్‌రెడ్డి, శ్రీరాములు, నర్సింహ్మా, రమణమూర్తి, రాజు, అఖిల్, ప్రకాష్, కుమార్, జూపల్లి నరేష్,అక్కాల సురేశ్, వినయ్‌రెడ్డి, కిషోర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, జయకుమార్, వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరికలు

**మేడ్చల్‌రూరల్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని ఇంటిగ్రేటెడ్ హోమ్స్ కాలనీవాసులు మంగళవారం బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈటల వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో కాలనీ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని కాలనీవాసులు తెలిపారు. జిల్లా పార్టీ అధ్యక్షులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లిఖార్జున్ ముదిరాజ్, సరస్వతి, హంసరాణి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో సునీత మహేందర్‌రెడ్డి

**మేడ్చల్:** మేడ్చల్‌లోని మహేశ్వరి ఫంక్షన్ హాల్‌లో ముస్లిం సోదరులకు మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాలు ప్రారంభం



**కీసర:** నాగారం మున్సిపల్ కార్యాలయ సమీపంలో, రాంపల్లిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జి.రాజేంద్రకుమార్ మాట్లాడుతూ చలివేంద్రాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ పరిధిలోని వివిధవార్డుల్లో ప్రజలు నీటివృథాను తగ్గించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, డీఈఈ రఘు తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌ల చోరీ కేసులో నిందితుడి రిమాండ్

**మల్లాపూర్:** ద్విచక్రవాహనాల దొంగలిస్తున్న పాత నేరస్తుడిని నాచారం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ శాయంపేటకు చెందిన మామిడి రత్నకర్(31) పని కోసం వచ్చి మౌలాలి హెచ్‌బీ కాలనీ, ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నాడు. జల్సాలకు అలవాటుపడి ద్విచక్రవాహనాలను అపహరించడం మొదలు పెట్టాడు. వరంగల్ సుబేదారిలో (టీఎస్03ఈఎం9948), నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ స్పెండర్ బైక్ (ఏపీ28ఎస్8835)ను దొంగలించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం మల్లాపూర్ ఎన్టీఆర్‌నగర్‌లో రత్నాకర్ అనుమానాస్పదంగా కన్పించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. దీంతో నిందితుండి వద్ద ఉన్న రెండు ద్వి చక్ర వాహనాలను స్వాధీనం చేసుకోని రిమాండ్‌కు తరలించారు.



# ఉపాధి కూలీలకు వేతన భరోసా

- అమలులోకి పెరిగిన అదనపు కూలీ రూ.28
- జిల్లాలో 19,350 జాబ్ కార్డులు.. కూలీలు 21,586 మంది
- ప్రతీ రోజు ఉపాధి పనుల్లో 100 నుంచి 250 మంది కూలీలు

**సాక్షి,మేడ్చల్ జిల్లా:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు కేంద్రం దినసరి కూలి పెంచింది. ఈ పెంపు ఏప్రిల్ నుంచే అమలులోకి రానుంది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.272 కూలి చెల్లిస్తుండగా... తాజాగా మరో రూ.28 పెంచింది. దీంతో దినసరి వేతనం రూ.300 చేరింది. 2005 సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ప్రారంభం కాగా, తొలుత రూ.87.50 చెల్లించారు. 2022లో రూ.12 పెంచగా, 2023లో రూ.15 అదనంగా చెల్లించడంతో రోజుకు గరిష్ఠంగా కూలీని రూ.272 నిర్ణయించింది. ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి కొత్త వేతనాలు అమలు చేస్తూ.. సర్కారు చర్యలు తీసుకుంటోంది. తాజా నిర్ణయంతో సంబంధిత వర్గాల్లో భరోసా ఏర్పడిందనే చెప్పచ్చు.

### 19,350 జాబ్ కార్డులు.. 21,586 మంది కూలీలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో మొత్తంగా 19,350 జాబ్ కార్డులకు 21,586 మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో చాలావరకు వ్యవసాయ పనులు పూర్తి కావొచ్చాయి. కూలీలు ఉపాధి' బాట పట్టారు. ఉపాధి పనులతో రోజుకు కనీసం రూ.250 నుంచి రూ.270 వరకు వస్తోంది. పెరిగిన వేతనంతో కూలీలకు మరింత ఆర్థిక అండ కలగనుంది. అయితే ఏటా సర్కారు పని దినాల లక్ష్యాన్ని జిల్లాల వారీగా కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆర్థిక సంవత్సరానికి కూడా నిర్దేశించిన లక్ష్యానికి చేరువలో జిల్లా యంత్రాంగం కృషిచేస్తుంది.

### ముఖ హాజరు గుర్తింపుతో...

ఉపాధి హామీలో అవకతవకలు అరికట్టేందుకు సర్కారు ఎప్పటికప్పుడు నూతన విధానాల రూపకల్పనలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పనుల్లోకి వచ్చినవారి వివరాల నమోదుకు ప్రత్యేకంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్) అనే యాప్‌ను రూపొందించింది. ఆయా కూలీపనులు ప్రారంభానికి ముందు వచ్చిన వారి ఫొటోను పని ప్రదేశంలోనే సెల్‌ఫోన్‌లో తీసి, అందులో ఉదయం 11 గంటల్లోపు అప్‌లోడ్ చేయాల్సి ఉంటోంది. పని ముగిసిన తర్వాత మళ్లీ మరోసారి ఫొటో తీసి పొందుపర్చుతారు. ఈ విధానంతో కూలీల హాజరు పక్కాగా ఉండటంతోపాటు, జరిగిన పనులు, వారికి వచ్చే వేతనం పక్కదారి పట్టకుండా ఉండేలా చర్యలు చేపట్టారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సైతం వారు పొందుపర్చిన సమాచారాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా అధికారులను నియమించారు.

### వేసవి భత్యం ఎప్పుడో..?

దినసరి వేతనం రూ.28 వరకు పెంచినా కూలీలు అసంతృప్తితోనే ఉన్నారన్న వాదన వినిపిస్తోంది. గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు దినసరి కూలీతో పాటు వేసవి అదనపు భత్యం చెల్లించేవారు. ఈ సమయంలో 15 నుంచి 30 శాతం వరకు అధికంగా భత్యం ఉండేది. రెండేళ్ల నుంచి దీనిని తొలగించడంతో కూలీల్లో అసంతృప్తి నెలకొంది. పార, గడ్డపార, భత్యాలు కూడా వారానికి ఒకసారి చెల్లించేవారు. గత రెండేళ్ల నుంచి వీటిని నిలిపివేశారని కూలీలు పేర్కొంటున్నారు. నగర శివారు ప్రాంతం కావటంతో వ్యవసాయ, వ్యవసాయేతర పనులకు వెళ్తే రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు కూలీ చెల్లిస్తుండటంతో ఉపాధిహామీ పనులపై కూలీలు అంతగా ఆసక్తి చూపడంలేదనే వాదన ఉంది.

## నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు

**మేడ్చల్:** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిపి కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్దీన్, టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ అమరేందర్‌రెడ్డి, నాగారం మున్సిపల్ కౌన్సిలర్ హరిబాబు, గుండ్లపోచంపల్లి కౌన్సిలర్ శ్రీనివాస్ కురమతో కలిపి కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వీరభద్రారెడ్డి



కేటీఆర్ చేతులమీదుగా నియామకపత్రం అందుకుంటున్న వీరభద్రారెడ్డి

**మేడ్చల్:** మేడ్చల్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేడ్చల్‌కు చెందిన వీరభద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శామీర్‌పేట్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆయనకు నియామకపత్రం అందజేశారు. వీరభద్రారెడ్డి బీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉండి పని చేస్తున్నారు.

## వారం రోజుల్లో ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి



ముకుంద్ టాకీస్‌ను సీజ్ చేస్తున్న కమిషనర్, అధికారులు



రెస్టారెంట్‌ను సీజ్ చేస్తున్న కమిషనర్, అధికారులు

### సినిమా టాకీస్‌ను సీజ్ చేసిన కమిషనర్

**మేడ్చల్:** మేడ్చల్ మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు చేస్తున్న వారు ఏడు రోజుల్లోగా లైసెన్సులు తీసుకోకపోతే షాపులు సీజ్ చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి హెచ్చరించారు. పట్టణంలో ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, రెవెన్యూ సిబ్బందితో కలిసి పర్యటించి ట్రేడ్ లైసెన్స్‌లు లేని దుకాణాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు తప్పుడు కొలతలు చూపిన పక్షంలో 25 రెట్ల జరిమానా విధించి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ క్రమంలో నిబంధనలను అతిక్రమించిన పట్టణంలోని ముకుంద్ సినిమా థియేటర్, ముబార్ రెస్టారెంట్, జాన్‌డీర్ ట్రాక్టర్ షోరూంలను సీజ్ చేశారు.

## కాంగ్రెస్ 'ఎ' బ్లాక్ చేరికల కమిటీ నియామకం

**మేడ్చల్:** కాంగ్రెస్ పార్టీలో చేరికల సందర్భంగా 'ఎ'బ్లాక్ చేరికల కమిటీని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్ యాదవ్ నియమించారు. కమిటీ సభ్యులుగా 'ఎ'బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, పూడూర్ మాజీ సర్పంచ్ పోచయ్య, గౌడవెళ్లి మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, డబీల్‌పూర్ మాజీ సర్పంచ్ సంజీవరావు, కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, తూంకుంట నాయకుడు శ్రీనివాస్‌యాదవ్‌లను నియమించారు. ఈ మేరకు వారికి హరివర్ధన్‌రెడ్డి నియమాకపత్రాన్ని అందజేశారు.



నియామకపత్రం అందజేస్తున్న హరివర్ధన్‌రెడ్డి

## మద్యానికి బానిసై... చెరువులో దూకి..

**మేడ్చల్‌రూరల్:** మద్యానికి బానిసైన వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని కిందిబస్తీకి చెందిన బిందల జగదీశ్(30) గత కొంత కాలంగా మద్యానికి బానిసై మానసికంగా బాధపడుతున్నాడు. గత సోమవారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన జగదీశ్ సమీపంలో ఉన్న మేడ్చల్ పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు, కుటుంబీకుల చెరువులో గాలించి మృతదేహం వెలికితీశారు. ఈ మేరకు పోలీసుల కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

## గౌడవెళ్లి నేతల ఇంటికి ఈటల



మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి నివాసంలో ఈటెల

**మేడ్చల్:** బీఆర్‌ఎస్‌లో కీలక నేతలుగా ఉన్న గౌడవెళ్లికి చెందిన పలువురు నాయకుల ఇంటికి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ వెళ్లి తనకు ఎన్నికలలో మద్దతివ్వాలని కోరారు. మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పద్మ, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, రెడ్డి జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాంరెడ్డి లు నివాసముంటున్న సాకేత్ వెంచర్‌కు ఆయన వెళ్లారు. వీలైతే బీజేపీలో చేరాలని, లేని పక్షంలో పార్లమెంట్ ఎన్నికలలో తనకు మద్దతి ఇవ్వాలని ఆయన కోరారు. ఈటల రాజేందర్ మండలంలో విస్తృతంగా పర్యటించి అన్ని పార్టీల బలమైన నాయకులను, సీనియర్ రాజకీయ నాయకులను కలిసి మద్దతు కూడగడుతున్నారు.

## శ్రీరామాంజనేయ ఆలయ నూతన కమిటీ



శ్రీరామాంజనేయ ఆలయ నూతన కమిటీ సభ్యులు

**జవహర్‌నగర్:** జవహర్‌నగర్ కార్పొరేషన్ వికలాంగుల కాలనీలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరామాంజనేయ ఆలయ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా సంతోష్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బిక్షపతి, ఉపాధ్యక్షులుగా నరేందర్‌యాదవ్, పున్నంచారి, ప్రవీణ్, జనరల్ సెక్రటరీగా శంకర్, జాయింట్ సెక్రటరీగా కృష్ణమాచారి, క్యాషియర్‌గా కార్తీక్ రెడ్డి, సభ్యులుగా రవికుమార్, శంకర్‌గౌడ్, చెన్నారెడ్డి, కుర్ర రాజు, శ్రీనివాస్, వెంకటేష్, వేణుగోపాల్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీకి మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు.



# పోలింగ్ శాతం పెంపే లక్ష్యం

- లోక్‌సభ ఎన్నికల ఓటింగ్‌పై ఎన్నికల సంఘం చర్యలు
- తక్కువగా నమోదైన 715 పోలింగ్ కేంద్రాల్లో స్వీప్ కార్యక్రమాలు
- ఓటు ప్రాధాన్యత, వినియోగంపై ప్రజలకు అవగాహన
- విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులతో సంకల్ప పత్రాలు
- పోలింగ్ కేంద్రాల వద్ద వాక్ టు బూత్ కార్యక్రమాలు



**సాక్షి, మేడ్చల్ జిల్లా:** లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాల పరిధిలోని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారి సాంబశివరావుసహా అసెంబ్లీ నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 10 మంది స్వీప్ ఇన్‌చార్జ్‌లు ఓటు నమోదు, వినియోగంపై చర్యలు చేపట్టారు. జిల్లాలో ఎప్పటికప్పుడు తగిన కార్యాచరణతో స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, సమన్వయం కోసం కలెక్టర్ చైర్మన్‌గా ఏడుగురితో కోర్ కమిటీని ఏర్పాటు చేశారు.

### ఓటింగ్ శాతం తక్కువైన పోలింగ్ కేంద్రాలు 715

మేడ్చల్–మల్కాజిగిరి జిలాలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాలు 715 ఉన్నట్లుగా అధికార యంత్రాంగం గుర్తించింది. ఇందులో ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 207, కూకట్‌పల్లి 152, మల్కాజిగిరి 144, కుత్బుల్లాపూర్ 132, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 80 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా స్వీప్ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ పర్యటించి, ఓటు హక్కు వినియోగం, ప్రాధాన్యతపై స్థానిక ప్రజల్లో అవగాహన కల్పించేందుకు యత్నించారు. పోలింగ్ శాతం పెంచడానికి వివిధ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో మానవహారాలు ఏర్పాటు చేసి ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలోనే జిల్లావ్యాప్తంగా 1.76 లక్షల సంకల్పపత్రాలను విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు అందించి, సంతకాలు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. అందులో భాగంగానే 1.23 లక్షలు సంకల్ప పత్రాలపై ఓటర్లతో సంతకాలు చేయించారు. ప్రతి కళాశాలలో ఇద్దరు విద్యార్థులను అంబాసిడర్లుగా నియమించి, సంకల్ప పత్రాలు, స్వీప్ కార్యక్రమాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

### పోలింగ్ కేంద్రాల వద్దకే ...

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో వాక్ టు పోలింగ్ బూత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏయే పోలింగ్ కేంద్రంలో గతంలో పోలింగ్ శాతం తక్కువగా నమోదైందో అక్కడికి అధికారులు వెళ్లి ఓటర్లతో మమేకమవుతున్నారు. ఓటు హక్కును తప్పకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. ఇటీవల 5కే రన్ వంటి కార్యక్రమాల ద్వారా ఓటర్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

### మీటింగ్‌ల ద్వారా..

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అర్బన్ ప్రాంతాలు అత్యధికంగా ఉండటంతో వాటిపైన్నే అధికారులు దృష్టి సారించారు. ఇప్పటి వరకు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 15 సమావేశాల చొప్పున 75 స్వీప్ కార్యక్రమాలను చేపట్టారు. స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఓటు ప్రాధాన్యంపై సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాలనీ అభివృద్ధి కమిటీలు, గ్రేటర్ కమ్యూనిటీ కాలనీ అసోసియేషన్లు, వెల్ఫేర్ అసోసియేషన్లు, అపార్టుమెంట్ కమిటీలు, సీనియర్ సిటిజన్లతో సమావేశాలు నిర్వహించి, ఓటింగ్ శాతం పెంపునకు చర్యలు తీసుకుంటున్నారు.

### తప్పకుండా ఓటు వేయాలి

జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ సూచన మేరకు స్వీప్ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నాం. వయోజనులు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి.

– సాంబశివరావు
(డీఆర్డీఏ, స్వీప్ జిల్లా నోడల్ అధికారి)

## లీకైన గ్యాస్ సిలిండర్.. బాలుడికి గాయాలు

### లైట్ వేయగానే పేలుడు.. ఎగిరిపడ్డ ఇంటి పైకప్పు రేకులు



గాయాలపాలైన బాలుడు

**జవహర్‌నగర్:** ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఓ బాలుడు తీవ్ర గాయాపాలైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జవహర్‌నగర్ జ్యోతిరావునగర్ కాలనీలో నివసించే మల్లేష్, భార్య కవిత, ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. మల్లేష్ కూలి పనులు చేసుకుంటుండగా భార్య కిరాణ దుకాణం నిర్వహిస్తోంది. మంగళవారం ఉదయం భార్యభర్తలు పనులకు వెళ్లగా మధ్యాహ్నం స్కూల్ నుంచి వచ్చిన చిన్న కుమారుడు బన్నీ(7) ఇంట్లోకి వెళ్లి లైట్ వేశాడు. అయితే అప్పటికే గ్యాస్ లీకై ఉండగా లైట్ వేయడంతో ఒక్కసారి మంటలు ఎగసిపడి బాలుడికి అంటుకున్నాయి. పేలుడు ధాటికి ఇంటి రేకులు ఎగిరిపడి, గోడలకు బీటలు పడ్డాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా బాలుడిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో వివరణ కోరగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

**బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం...**

గ్యాస్ లీకేజీ బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ అన్నారు. జ్యోతిరావుకాలనీలోని గ్యాస్ లీకేజీ బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడిని పరిష్కరించాలి

**పోచారం:** మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, యంనంపేట్, అన్నోజిగూడ, నారపల్లి ప్రాంతాల్లో కృష్ణా నీటిలో మున్సిపల్ నీరు కలుస్తోందని చైర్మన్ కొండల్‌రెడ్డి జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. రెండు రకాల నీళ్లు కలిసిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని చోట్ల పాడైపోయిన పాత పైప్‌లైన్‌లు ఉన్నాయని, వాటిని మార్చి కొత్త పైప్‌లైన్‌లు వేయాలన్నారు. ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, యంనంపేట్‌లో సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంకుల నుండి కనెక్షన్లు ఇచ్చి నీటి ఎద్దడి సమస్యలను పరిష్కరించాలన్నారు. జీఎం శ్రీనివాస్‌రెడ్డికి సుదర్శన్‌రెడ్డి ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.